క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: మండలంలోని ఆత్మకూరు, సీకే ఫంక్షన్ హాల్, మంజీర అపార్ట్‌మెంట్స్, హ్యాపీ క్లబ్, హయ్యర్ ఎడ్యుకేషన్ ఏరియాలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా జరుగుతున్న అంతరాయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ



పొన్నూరు: పట్టణంలోని ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీకి పాల్పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎక్సైజ్ సీఐ రామారావు తెలిపిన వివరాలు.. బాపట్ల బస్టాప్‌లోని మద్యం దుకాణం వెనుక భాగంలోని షెటర్ నుంచి దొంగలు లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడ్డారు. లోపల ఉన్న సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి లాకర్లోని రూ.9.50 లక్షలు అపహరించినట్లు తెలిపారు. ఎక్సైజ్ పోలీసులు విచారణ చేపట్టారు. పట్టణ సీఐ రవి కిరణ్ దొంగతనం జరిగిన షాపు పరిశీలించి సిబ్బందిని విచారించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలు

ప్రత్తిపాడు: విద్యుదాఘాతంతో బాలుడు తీవ్ర గాయాలపాలైన ఘటన వట్టిచెరుకూరు మండలంలో చోటుచేసుకుంది. వివరాలు.. అనంతవరప్పాడు దళితవాడకు చెందిన ఎస్.ఆనంద్ రెండో కుమారుడు జోయల్ జేమ్స్(8) ఇంటిపై ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో కరెంటు వైర్లు బాలుడి చేతికి తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. పిల్లవాడు గిలగిలకొట్టుకుంటూ అలానే తీగలను పట్టుకుని ఉండటం గమనించిన స్థానికులు పెద్దగా కేకలు వేశారు. దీంతో చుట్టుపక్కల వారు వచ్చి విద్యుత్ తీగలను కర్రతో కొట్టి తప్పించారు. అప్పటికే బాలుడు స్పృహ తప్పిపోవడంతో బంధువులు, కుటుంబ సభ్యులు బాలుడిని చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం అక్కడే చికిత్స పొందుతున్నట్లు స్థానికులు తెలిపారు.

వినాయక నిమజ్జనంలో వివాదం : ఇద్దరికి గాయాలు

చేబ్రోలు: చేబ్రోలులో వినాయక నిమజ్జనం సందర్భంగా చోటుచేసుకున్న వివాదంలో ఇద్దరు గాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. మండల కేంద్రమైన చేబ్రోలులోని సినిమా హాలు సెంటర్‌లో వినాయక చవితి సందర్భంగా స్థానిక భక్తులు భారీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి వినాయక విగ్రహాన్ని నిమజ్జనం కోసం ఊరేగింపు బాణసంచా, మేళతాళాలతో అట్టహాసంగా ఏర్పాటు చేశారు. ఊరేగింపు ప్రారంభమైన కొద్ది సేపటికే వివాదం జరిగిన రెండు వర్గాలకు విడిపోయి ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలవటంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇరువర్గాలకు చెందిన వారు ఒకరిపై ఒకరు చేబ్రోలు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకోవటంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో అంతరాష్ట్ర దొంగ

వేజండ్ల(చేబ్రోలు): చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో వృద్ధ దంపతులు నివసిస్తున్న ఇంటిలో చోరీకి ప్రయత్నించిన దొంగను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. సోమవారం ఈ ఘటన వెలుగు చూసింది. మండల పరిధిలోని వేజండ్లలోని నర్సరీ యజమాని ఇల్లు, పక్కనే ఉన్న వృద్ధ దంపతుల ఇంటి వద్ద రాత్రి సమయంలో దొంగతనానికి ప్రయత్నించిన దొంగను స్థానికులు పట్టుకున్నారు. అనంతరం అతడిని పోలీసులకు సమాచారం అందించటంతో వారు తీసుకువెళ్లారు. పోలీసుల అదుపులో ఉన్న దొంగ గోపిగా గుర్తించారు. ఇతను అనేక దొంగతనాలకు పాల్పడినట్లు గుర్తించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 39కిపైగా పలు దొంగతనాలు, నేరాలకు పాల్పడిన కేసులు ఉన్నట్లు తెలిసింది. చేబ్రోలు పోలీసుల కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కంప్యూటర్, ట్యాలీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ నైపుణ్యంపై ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధి హరిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన 18 నుంచి 28 ఏళ్ల లోపు వయసు ఉన్న అభ్యర్థులకు బెంగళూరులో 35 రోజుల పాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ట్యాలీ ప్లస్ జీఎస్టీ, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై అత్యుత్తమ శిక్షణ కల్పించి, శిక్షణానంతరం వివిధ సంస్థల్లో నెలకు రూ.15 వేలకు పైబడిన వేతనంతో నూరు శాతం ఉద్యోగాలను చూపిస్తామని తెలిపారు. వివరాలకు 90004 87423 నంబర్లో సంప్రదించాలని కోరారు.

జై బోలో గణేష్ మహరాజ్‌కీ..



సొలస బస్టాండు సెంటర్‌లో రెడ్ల యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయకుడు



ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి



శ్రీకృష్ణదేవరాయ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విఘ్నేశ్వరుడు

- నిమజ్జనానికి తరలిన గణనాథులు
- మేళతాళాలతో ఊరేగింపు

మండలంలోని పలుగ్రామాల్లో వినాయక చవితి పందిళ్లలో గణపతి విగ్రహాలకు పూజలు చేశారు. కాగా నవరాత్రుల పూజల అనంతరం సోమవారం ప్రత్యేక వాహనాల్లో విగ్రహాలను ఉంచి నిమజ్జనానికి తరలించారు. ఫిరంగిపురంలోని సొలస బస్టాండు సెంటర్‌లో రెడ్లయూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామంలో ఊరేగించి నిమజ్జనానికి అమరావతికి తరలించారు. అలాగే తూర్పుబజారులోని పోలేరమ్మ గుడివద్ద శ్రీకృష్ణదేవరాయ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడిని అలంకరించిన వాహనంలోఉంచి గ్రామంలో ఊరేగించి, నిమజ్జనానికి తరలించారు. రామాలయం వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పూజలందుకున్న గణనాథుడిని మేళతాళాలతో ఊరేగించి నిమజ్జనానికి తరలించారు.

-ఫిరంగిపురం

నేటి నుంచి 'స్వచ్ఛత హీ సేవ'

- అక్టోబరు 2 వరకు నిర్వహణ
- షెడ్యూల్ విడుదల చేసిన అధికారులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో జరిగే స్వచ్ఛత హీ సేవ షెడ్యూల్‌ను దుగ్గిరాల ఎంపీడీఓ శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దుగ్గిరాల ఇన్‌ఛార్జి ఎంపీపీ షేక్ జబీన్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందని, ఈనెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు.

17వ తేదీ మండల కార్యాలయంలో స్వచ్ఛత హీ సేవ ప్రారంభోత్సవం, ప్రతి పంచాయతీకి ఒక నోడల్ అధికారిని నియమించడం.

- 18, 19 తేదీల్లో గ్రామాల్లో రోడ్లను శుభ్రం చేయడం, చెత్త కుప్పలు తొలగించడం, మురికి నీరు నిల్వలేకుండా చర్యలు తీసుకోవడం, ప్రతి ఇంటికి వైద్య సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బందితో ఫాగింగ్, యాంటీ లార్వా కార్యక్రమాల నిర్వహణ.
- 20వ తేదీ ప్రతి ఇంటి వద్ద తడి మరియు పొడి చెత్తను వేరు చేసి క్లాప్ మిత్రులకు అందజేసేవిధంగా అవగాహన కల్పించడం, సేకరించిన తడి చెత్త ద్వారా వర్మి కంపోస్ట్ తయారు చేయడం.
- 21,22వ తేదీల్లో వి.డబ్ల్యు.ఎస్.సి. కమిటీ మెంబర్లచే ప్రజలకు తాగునీటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడం, మంచినీటి పైప్‌లైన్ లీకేజీలను గుర్తించి అరికట్టడం, నీటి వనరుల వద్ద పిచ్చిమొక్కలు తొలగించి శుభ్రం చేసి పూలమొక్కలు నాటే కార్యక్రమం.
- 23వ తేదీ ఎలిమెంటరీ, ప్రైమరీ, ఉన్నత పాఠశాలలు మరియు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులకు పారిశుద్ధ్య, ఘన వ్యర్థ నిర్వహణపై అవగాహన కల్పించడం.
- 24, 25 తేదీల్లో ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరికీ ఒకసారి వాడిపారేసే ప్లాస్టిక్ వాడడం వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడం, ప్రతి దుకాణానికి ప్లాస్టిక్ నిషేధంపై నోటీసులు జారీ చేయడం, అతిక్రమించిన వారి వద్ద నుంచి గ్రామ మహిళా పోలీస్ ద్వారా జరిమానా విధించి వసూలు చేయడం.
- 26వ తేదీ గ్రామ సభ నిర్వహించి తీర్మానం చేసి ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్‌ను నిషేధించేలా చర్యలు తీసుకోవడం.
- 27వ తేదీ ప్రతి మురుగునీటి కాలువను శుభ్రం చేయడం మరియు సిల్టు తొలగించడం.
- 28, 29 తేదీల్లో గ్రామాల్లో బహిరంగ మల, మూత్ర విసర్జన జరిగే ప్రదేశాలను గుర్తించి శుభ్రం చేయడం, ఆ ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి మొక్కలను నాటించే కార్యక్రమం.
- 30వ తేదీ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు పారిశుద్ధ్యంపై పోటీలు నిర్వహించి వారిచే గ్రామాల్లో మానవహారం, ర్యాలీ నిర్వహించడం.
- అక్టోబర్ 1వ తేదీ శ్రమదాన కార్యక్రమం ద్వారా ముందుగా గుర్తించిన ప్రాంతాలను శుభ్రపరచి స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయడం.
- 2వ తేదీ స్వచ్ఛ భారత్ దినోత్సవాన్ని ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించడం మరియు గ్రామ ప్రగతికి కృషి చేసిన వారిని గుర్తించి వారిని సత్కరించడం. ఆయా కార్యక్రమాల్లో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు కోరారు.

సీతారాం ఏచూరి మృతి తీరని లోటు



ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

పెదకాకాని: సీపీఎం అఖిల భారత కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని పార్టీ నాయకుడు వై.నేతాజి అన్నారు. పెదకాకాని పుచ్చలపల్లి సుందరయ్యకాలనీలో సోమవారం పార్టీ మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి నాయకుడిగా ఎస్ఎఫ్ఐలో పనిచేస్తూ పార్టీకి ఆకర్షితులై పార్టీలో సభ్యత్వం తీసుకొని అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి ఎదగటం నిరంతరం అధ్యయనం చేయటం జరిగిందన్నారు. అనేక ప్రపంచ కమ్యూనిస్టు దేశాలతో సరిసంధాలు కొనసాగించడం చివరి వరకు తను నమ్మిన సిద్ధాంతం కొరకు పని చేశారన్నారు. సీతారాం ఏచూరి చనిపోవడం చాలా బాధాకరం, పార్టీకి తీరని లోటని ఆయన ఆశయాలను ముందుకు తీసుకు పోవడమే ఆయనకు అర్పించే ఘనమైన నివాళులని పేర్కొన్నారు. తొలుత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ, ఎం.శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, నరిశెట్టి నాగరత్నం, బి.బాబూరావు, బి.సాంబయ్య పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఉద్యమిస్తాం



షేక్ నజీర్ అహ్మద్

పెదకాకాని: దేశంలో ఉన్న ముస్లింలను వేధించడానికి మత స్వేచ్ఛను హరించడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు షేక్ నజీర్ అహ్మద్ అన్నారు. పెదకాకానిలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు, కో ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఉద్యమం తప్పదన్నారు. గత ఎన్నికల్లో నయవంచనతో మోసం చేసి గెలిచాక ముస్లిం మైనార్టీలు అన్యాయం చేయడంపై దారుణంగా ఉందన్నారు. మైనార్టీల ప్రాథమిక హక్కులు, ఇస్లామిక్ చారిటీ చట్టాలు ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ చర్యలు రాజ్యాంగంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని చెప్పారు. వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకించిన వారిలో రాష్ట్ర మైనార్టీ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు షేక్ అలీముర్తీజా, షేక్ జాకీర్‌హుస్సేన్, షేక్ ఉస్మాన్, షేక్ ఇబ్రహీం, షేక్ అల్లావుద్దీన్, షేక్ జానీ(దండిబాబు) ఉన్నారు.

బీసీల భూములను కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

బీసీ చైతన్య సమితి జాతీయ అధ్యక్షుడు బీసీ రమణ

తాడేపల్లిరూరల్: రాష్ట్రవ్యాప్తంగా బీసీల భూములను కబ్జా చేసినవారిపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని బీసీ చైతన్య సమితి జాతీయ అధ్యక్షుడు బీసీ రమణ అన్నారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని ఉండవల్లి రాజగృహలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బీసీల భూములు ఎక్కువశాతం కబ్జాకు గురయ్యాయని, గతంలో అవినీతి అధికారులు కబ్జాదారులకు సహకరించారని, ఎటువంటి రక్షణ చట్టాలు లేని బీసీల భూములు ఎక్కువగా అన్యాక్రాంతం అయ్యాయని అన్నారు. కూటమి ప్రభుత్వం విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని కోరుతున్నామన్నారు. జాతీయ బీసీ చైతన్య సమితి ఆధ్వర్యంలో ఒక కమిటీని ఏర్పాటు చేసుకుని కబ్జాకు గురైన పొలాలను పరిశీలించామని, ఆయా జిల్లా కలెక్టర్లకు కొన్ని విషయాలు అందజేస్తామని ఆయన తెలిపారు. ప్రజా సంఘాల నాయకులు జైబాబు, జాతీయ కార్యదర్శి కోలా ఏడుకొండలు, అసోసియేట్ అధ్యక్షులు కావేటి వేణుగోపాల్, పల్నాడు కృష్ణ, ఏలూరు జిల్లా నాయకులు ఎ.నాగరాజు, ఎం.రాము, కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో వ్యర్థాలను వేస్తే కఠిన చర్యలు

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



వీధి వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రోడ్ల వెంబడి ఉన్న కొబ్బరి బోండాలు, టిఫిన్, టీ విక్రయదారులు వ్యర్థాలను రోడ్ల మీద, డ్రైయిన్‌లో వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం కమిషనర్ ఏటీ అగ్రహారం, శాంతి నగర్, జీటీ రోడ్, సంపత్ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో ప్రధాన రహదారుల వెంబడి ఉన్న వివిధ వ్యాపారాలు చేసే వారు వ్యర్థాలను రోడ్ల మీద, కాలువల్లో వేస్తున్నారని, ప్రధానంగా కొబ్బరి బోండాలు డ్రైయిన్‌లలో వేయడం వలన మురుగుపారుదలకు అడ్డంకిగా ఉంటుందన్నారు. శాంతి నగర్, సంపత్ నగర్‌లో స్థానిక ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ ప్రజల నుంచి అందే అర్జీలు, ఫిర్యాదుల పరిష్కారానికి ఆయా విభాగాధిపతులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానికంగా ఉండే వార్డు సచివాలయ కార్యదర్శులు తప్పనిసరిగా నిర్దేశిత సమయాల్లో విధుల్లో ఉండాలని ఆదేశించారు. ఈ పర్యటనలో డీఈఈ రమేష్ బాబు, టీపీఎస్ లక్ష్మణ స్వామి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేటి నుంచి స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలు

స్వచ్ఛత హీ సేవలో భాగంగా మంగళవారం గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని వార్డ్ సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాలు, నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, విజ్ఞాన మందిరం, ఎన్టీఆర్ స్టేడియాల్లో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులతో స్వచ్ఛత హీ సేవా ప్రతిజ్ఞ చేయించనున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛత హి సేవా కార్యక్రమాన్ని గుంటూరు నగరంలో ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు అన్ని వర్గాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో స్వచ్ఛ గుంటూరు లక్ష్యంగా వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.

ముగిసిన యూటీఎఫ్ క్రీడా, సాంస్కృతిక పోటీలు

గుంటూరు ఎడ్యుకేషన్: యూటీఎఫ్ స్వర్ణోత్సవాల సందర్భంగా సంఘ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన క్రీడా, సాంస్కృతిక పోటీలు సోమవారం ముగిశాయి. రెండు రోజులపాటు నిర్వహించిన పోటీల్లో భాగంగా ఆయా విభాగాల్లో విజేతలను ప్రకటించారు. షటిల్, చెస్, క్యారమ్స్, వాలీబాల్, క్రికెట్ పోటీలకు 300 మంది ఉపాధ్యాయులు, 20 మంది పీఈటీలు పాల్గొన్నారని సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ తెలిపారు. అక్టోబర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కోశాధికారి ఎండీ దౌలా, జిల్లా కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, కె.సాంబశివరావు, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందు, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.కోటిరెడ్డి, కె.ప్రేమ్‌కుమార్, కె.ప్రభుజీ పాల్గొన్నారు.

యువతకు బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్‌తో మేలు



చలపతి ఫార్మసీలో బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్

గుంటూరు రూరల్: వినూత్న వ్యాపార ఆలోచనలను చలపతి ఫార్మసీ కళాశాల స్వాగతిస్తోందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. సోమవారం నగరశివారుల్లోని లాం కళాశాలలో చలపతి బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను గుంటూరు వోల్కస్ ఫాంటమ్ ఐపీ సొల్యుషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తంగా ఎంఎస్ఎంఈ ఐడియా హాకత్తాన్- 4.0 అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ ఇంక్యుబేషన్ సెంటర్ వివిధ నూతన వ్యాపార సంస్థల స్థాపనకు అవసరమయే నూతన ఆలోచనలను స్వాగతిస్తుందని పేర్కొన్నారు. చలపతి ఫార్మసీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో చలపతి ఇంక్యుబేషన్ సెంటర్‌ను 2020లో ప్రారంభించారని అప్పటి నుంచి ఈ సెంటర్ ద్వారా కళాశాలలోని విద్యార్థులందరికీ అనేక అవగాహనా కార్యక్రమాలు, 14 స్కిల్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్స్‌ను నిర్వహించడమే కాకుండా ఇప్పటి వరకు మొత్తం 4 పేటెంట్స్ మంజూరు చేయటం జరిగిందన్నారు. 36 పేటెంట్స్ ప్రచురించబడటమే కాకుండా 43 పేటెంట్స్ ప్రాసెస్‌లో ఉన్నాయని తెలిపారు. అధ్యాపకుల సహకారంతో విద్యార్థులు ఇప్పటి వరకు 24 ఫార్మాస్యూటికల్ ప్రొడక్షన్స్ డెవలప్ చేశారని, వీటిలో కొన్ని ప్రొడక్షన్స్ ప్రధాన మంత్రి జన ఔషధీ ద్వారా వివిధ రుగ్మతల నివారణకు ఉపయోగిస్తున్నారన్నారు. ప్రస్తుత ఈ ఐడియా హాకత్తాన్ నాలుగో పారిశ్రామిక విప్లవం వడ్రంగి, కుమ్మరి కుండల తయారీ వంటి నైపుణ్య వ్యాపార ఆలోచనలతో పాటు ప్రధాన మంత్రి విశ్వకర్మ వాణిజ్యంలోని స్పోర్ట్స్ టెక్నాలజీస్, ఇంటర్నెట్ ఆన్ థింగ్, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ అనేక ఇతర తయారీ రంగాలలోని ఆటోమేషన్లపై కూడా నూతన ఆలోచనలను స్వాగతిస్తుందన్నారు. వ్యాపార నూతన ఆలోచనలను ఈ నెల 23వ తేదీ లోపు పంపగలరన్నారు. ఎంచుకున్న ఆలోచనలు మంత్రిత్వ శాఖ ఎంఎస్ఎంఈ ఇన్నోవేషన్ పథకం ద్వారా ఇంక్యుబేషన్ సపోర్ట్‌తో పాటు రూ.15 లక్షల వరకు నిధులు కూడా పొందవచ్చన్నారు. ఆలోచనలు పంపవలసిన వ్యక్తులు 18 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు వారై ఉండాలని, విద్యార్థులే కాకుండా ఎవరైనను వినూత్న ఆలోచనలతో ముందుకు రావచ్చని తెలిపారు.

29న జేవీవీ కథల పోటీలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, అనిల్ కుమార్, వేణుగోపాల్, ప్రసాద్, సుభాని తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పాఠశాల స్థాయి విద్యార్థులకు ఈనెల 29న కథల పోటీలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో సోమవారం పోటీలకు సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకను వెలికితీసేందుకు ఈనెల 29న ఉదయం 10 గంటలకు ఏసీ కళాశాలలో నిర్వహించనున్న పోటీలకు ఆరో తరగతి నుంచి టెన్త్ వరకు చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ఎటువంటి ఎంట్రీ ఫీజు లేకుండా విద్యార్థులు పాల్గొనచ్చునని చెప్పారు. విద్యార్థులు రాసిన కథల నుంచి ఎంపిక చేసిన కథలను గుంటూరు జిల్లా పిల్లల కథలు పేరుతో విద్యార్థి పేరు, ఫొటో, పాఠశాల, తల్లిదండ్రుల పేర్లతో పుస్తకాన్ని ముద్రించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 90004 53600, 99480 15701, 97035 79996 నంబర్లలో సంప్రదించాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు టి.జాన్‌బాబు, బి.ప్రసాద్, జి. వెంకటరావు, ఎస్ఎం సుభానీ, బి.శంకర్‌సింగ్, బి.ప్రతాప్‌సింగ్, ఇ.అనిల్‌కుమార్, ఎస్.వేణుగోపాల్, ఎండీ అక్బర్ పాల్గొన్నారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

పట్నంబజారు: మహిళను వేధింపులకు గురిచేసి దుర్భాసలాడిన వ్యక్తిపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాలు.. కేవీపీ కాలనీలో నివాసం ఉండే బాషా నగరంపాలెంలోని ఐటీసీ వద్ద టిఫిన్ బండి నిర్వహిస్తుంటాడు. బాషా అక్క మెహబున్నీసా భర్త కొంతకాలం క్రితం మృతి చెందాడు. ఈ నేపథ్యంలో ఆమెను వేధింపులకు గురిచేయడం ప్రారంభించాడు. సోమవారం ఆమెను ద్విచక్ర వాహనంపై అడ్డుపడి వేధింపులకు గురిచేయడంతోపాటు, దుర్భాషలాడడంతో మెహబున్నిసా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా హక్కుల పోరాట యోధుడు బొజ్జా తారకం



నెహ్రూనగర్: న్యాయవాదిగా ప్రజా హక్కుల కోసం అహర్నిశలు పోరాటం చేసిన పోరాట యోధుడు బొజ్జ తారకం అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. బొజ్జతారకం వర్ధంతిని పురస్కరించుకుని అరండల్‌పేటలోని సంఘ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదిగా, రచయితగా కవిగా తనకున్న మేధను దళిత గిరిజనుల హక్కుల కోసం ఎంతగానో శ్రమించిన విప్లవ యోధుడు బొజ్జ తారకం అని కొనియాడారు. కార్యక్రమంలో బహుజన పొలిటికల్ సెంటర్ రాష్ట్ర కోఆర్డినేటర్ సాదు మాల్యాద్రి, బీసీ మహాజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ నరసింహారావు, డెమొక్రటిక్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు చాట్ల డేన్నిస్ రాయ్, దళిత బహుజన ప్రజా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ శిఖా సురేష్, ప్రజా పోరు రాష్ట్ర అధ్యక్షులు పాటిబండ్ల కోటేశ్వరావు, న్యాయవాది శ్రీనివాస్, జోజి, తిరువళ్లూరు హరినాథ్ బాబు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవాల్లో అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

తెనాలి: స్థానిక షరాఫ్ బజార్లో వేంచేసి ఉన్న శ్రీసువర్చలాసమేత శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో వార్షిక పవిత్రోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడురోజులు జరిగే ఉత్సవాల్లో భాగంగా తొలి రోజున వైఖానస ఆగమం ప్రకారం అష్టోత్తర శతకలశాభిషేకం, సాయంత్రం అంకురార్పణ, పవిత్ర అధివాస కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం సభ్యులు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు.

మంగళవారం సుదర్శన హోమం జరుగుతుందని, 18న పవిత్ర విసర్జన, పూర్ణాహుతి, తిరుప్పావడ సేవ జరుగుతాయని ఆలయ ఈవో అవుతు శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని, స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఆలయం వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, నిఖిల్ శాండిల్య, అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, కిరణ్‌కుమార్, సురేష్, శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన సేవాసమితి సభ్యులు గుడివాడ బాలకృష్ణ, మూర్తి వెంకటేశ్వరరావు, జంధ్యం రామారావు, మడుపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హోం గార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



నగరంపాలెం: తోటి హోం గార్డు కుటుంబానికి ఆర్థికంగా తోడ్పాటు అందించడం అభినందనీయమని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. డెప్యూటేషన్‌పై ఏపీఎస్పీడీసీఎల్‌లో విధులు నిర్వర్తించే హోం గార్డు జయదాసు అనారోగ్యంతో జూలైలో మృతిచెందారు. ఈ క్రమంలో జిల్లాలోని హోంగార్డుల ఒక రోజు వేతనం రూ.2.28 లక్షల చెక్కును జయదాసు భార్య శాంతకుమారికి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీ(ఏఆర్) హనుమంతు, హోంగార్డు ఇన్‌ఛార్జి ఆర్ఐ వెల్ఫేర్ శ్రీనివాసరావు, ఆర్ఎస్ఐ రత్నరాజు పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

రాయపూడి శ్రీనివాసరావు